MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక






ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 161 | శనివారం 10 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-





## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో
# బీసీల రిజర్వేషన్లు ఖరారు

**మున్సిపల్ ఛైర్‌పర్సన్లలో 32.03, మేయర్లలో 35.02 శాతం**

**ఎంపీపీల్లో 24.60, జడ్పీ ఛైర్‌పర్సన్లు 23.08 శాతం, సర్పంచ్‌లు 27.95 శాతం**

### క్యాబినెట్ నిర్ణయం



**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 10):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన భేటీ అయిన ఏపీ క్యాబినెట్ రాజీవ్ రంజన్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసింది. గ్రామ పంచాయతీ వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ ఛైర్‌పర్సన్, మున్సిపల్ వార్డు మెంబర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, మేయర్‌తో సహా 8 కేటగిరీల్లో రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు క్యాబినెట్ భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడించారు. పంచాయతీ వార్డు మెంబర్స్‌లో బీసీలకు 26.73 శాతం రిజర్వేషన్లు, సర్పంచ్‌లలో 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55, ఎంపీపీల్లో 24.60, జడ్పీటీసీలకు 24.60 శాతం, జడ్పీ ఛైర్‌పర్సన్లకు 23.08 శాతం, అర్బన్ వార్డుమెంబర్లకు 32.78 శాతం మేర బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేలా నిర్ణయించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్లలో 32.03 శాతం, మేయర్లలో 35.02 శాతం మేర రిజర్వేషన్లు ఖరారు చేశారు.



## స్థానిక ఎన్నికల్లో లీగల్ సెల్
# రక్షణ కవచంలా నిలవాలి

**వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు న్యాయపరమైన అండగా ఉండాలి**

**ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి**




**(అంకుశం, తాడేపల్లి, సెప్టెంబర్ 10):**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా నిలవాలని పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకష్ణారెడ్డి పిలుపునిచ్చారు. నామినేషన్ దాఖలు నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో అభ్యర్థులకు పూర్తి న్యాయపరమైన అండ అందించాలని సూచించారు. తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన

- మిగతా 2లో

## సీఈసీ రాజీనామా డిమాండ్..
# దద్దరిల్లిన దేశ రాజధాని ఢిల్లీ

**ఓటర్ల జాబితా సవరణలపై విపక్షాల అభ్యంతరాలు**

**సీజేపీ నిరసనకారులను అడ్డుకున్న పోలీసులు**




**(అంకుశం, న్యూఢిల్లీ, అక్టోబరు 10):**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం చేపట్టిన నిరసనలతో దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం భారీ ఆందోళనకు పిలుపునివ్వడంతో పోలీసులు ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. నిరసనకారులు ఆందోళన ప్రదేశానికి చేరుకోకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. నిరసనల నేపథ్యంలో ఢిల్లీలోని కీలక-

మిగతా 2లో

# కిరణ్ మృతిపై వైయస్ జగన్ సంతాపం



**తాడేపల్లి:**

కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సీపీఎం సీనియర్ నాయకులు ఎం.ఎ. అబ్దుల్ గఫూర్ గారు, సీపీఎం రాష్ట్ర నాయకురాలు పి. నిర్మల గార్ల పెద్ద కుమారుడు కిరణ్ అమెరికాలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఉన్నత విద్యను అభ్యసించి, అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రముఖ సంస్థలో సీనియర్ డేటా సైంటిస్ట్‌గా పనిచేస్తూ మంచి భవిష్యత్తు కలిగిన కిరణ్ అకాల మరణం అత్యంత బాధాకరమని వైయస్ జగన్ పేర్కొన్నారు. కన్నకొడుకును కోల్పోయిన ఎం.ఎ. అబ్దుల్ గఫూర్ , పి. నిర్మల దుఃఖం వర్ణనాతీతమని, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారికి, కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. కిరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, అబ్దుల్ గఫూర్ గారు, నిర్మల, వారి కుటుంబ సభ్యులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆంధ్ర సీనియర్స్ ఏ జట్టుకు మచ్చా దత్త రెడ్డి ఎంపిక

**ఈ క్రికెట్ సీజన్ లో 1675 పరుగులు 14 అర్థ సెంచరీలు రెండు సెంచరీలు**

**ఆంధ్ర వికెట్ కీపర్ లలో మొదటి స్థానం బ్యాటింగ్ కీపింగ్ రంగాల్లో**




**అంకుశం స్పోర్ట్స్ న్యూస్ విజయవాడ అక్టోబర్ 10**

అనంతపురం జిల్లాకు చెందిన యువ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి అద్భుతంగా రాణించారు ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ నిర్వహించిన పోటీలలో అద్భుత బ్యాటింగ్ కీపింగ్ రంగాల్లో రాణించి ఆకట్టుకున్నారుఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఆంధ్ర ఇంటర్ జోనల్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన యువ క్రికెటర్అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి ఆంధ్ర సీనియర్స్ ఏ జట్టుకు ఎంపికయ్యారు మచ్చా దత్త రెడ్డి ఈ క్రికెట్ సీజన్లో అద్భుత బ్యాటింగ్ కీపింగ్ ప్రదర్శనలతో క్రికెట్ సీజన్లో మొత్తం 1675 పరుగులు సాధించారు అందులో రెండు సెంచరీలు 14 అర్థ సెంచరీలు ఉండడం విశేషం అదేవిధంగా ఈ క్రికెట్ సీజన్లోనే 114 సిక్సర్లు కొట్టిన క్రికెటర్గా ఆంధ్ర క్రికెట్ చరిత్రలో మొదటి ప్లేయర్ గా ఈ ఏడాది రికార్డ్ సృష్టించారు మచ్చా దత్త రెడ్డి గతంలో అండర్ 12 అండర్ 16 అండర్ 19 అండర్ 23 ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడంతోపాటు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ శిక్షణ నేషనల్ క్రికెట్ అకాడమీ ఎన్సీఏ శిక్షణకు కూడా ఎంపికయ్యారు అనేక సంవత్సరాలుగా ఆంధ్ర రాష్ట్ర జట్టుకు ఎంపికై రాణించి ఆంధ్ర జట్టు ని గెలిపించారు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఏపీఎల్లో తుంగభద్ర వారియర్స్ జట్టుకు వైస్ కెప్టెన్ గా వ్యవహరించారు ఎంపికైన ఆంధ్ర సీనియర్స్ ఏ జట్టు కు మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నందు శిక్షణ శిబిరం ఈనెల 11వ తారీకు వరకు శిబిరం నిర్వహించడం జరుగుతుందిఆంధ్ర సీనియర్స్ ఏ జట్టు హైదరాబాద్

- మిగతా 2లో

అంకుశం
సాయంకాలం దినపత్రిక
శనివారం 10 అక్టోబర్ 2026

## చంద్రబాబు ఆశీస్సులతోనే ఎమ్మెల్యే అరాచకాలు

-- అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దోపిడీ పాలన

-- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



**(అంకుశం, అనంతపురం, సెప్టెంబర్ 10):** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతోనే అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆయన అనుచరులు అరాచకాలకు పాల్పడుతున్నారని వైయస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, అనంతపురం అర్బన్ నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. నగరంలో రెండున్నరేళ్లుగా దోపిడీ పాలన కొనసాగుతోందని, సొంతంగా ఇల్లు నిర్మించుకోవాలన్నా కూటమి నాయకులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. రుద్రంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రి బంధువు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం పరిస్థితికి నిదర్శనమని అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. జిల్లాలో మట్టి, ఇసుక దందాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు అమలు చేశామని, రుద్రంపేట పంచాయతీలో అనేక అభివద్ధి పనులు చేపట్టినా వాటిని ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లలేకపోయామని పేర్కొన్నారు. ప్రస్తుతం చిన్న పనులకు సైతం ప్రచార ఆర్భాటాలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ కార్యకర్తలకు గౌరవం పెరిగేలా ఐడీ కార్డులు అందిస్తున్నామని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రమాదవశాత్తు కార్యకర్త ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతున్నారని, వైయస్ జగన్ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళలు, యువతను మోసం చేసిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## 100 శాతం గెలవాల్సిందే!

-- మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 10):** స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానిక ఎన్నికల్లో 100శాతం గెలవాల్సిందేనని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులతో సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులదేనని స్పష్టంచేశారు. నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి చేసి, రెగ్యులర్ పాలనలోకి వెళ్లాలని సూచించారు.

## ముఖ్యమంత్రి సేవలు మరువలేము



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 10** ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 16 సంవత్సరాలనుండి ముఖ్యమంత్రి గా ఉత్తమ సేవలు అందిస్తున్న శుభ తరుణం లో ధర్మవరం 43 వార్డు టీడీపీ ఇంచార్జి లెజెండ్ తోట నారాయణ స్వామి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో అభిమానం తో ఫొటో తీయించుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి కి ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయం ఆయన తెలియజేసారు

## ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం

ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**ఎస్ ఐ ఆర్ రద్దు చేస్తూ ఓటుహక్కుల పరిరక్షణ కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన**



అంకుశం న్యూస్ విడపనకల్ అక్టోబర్ 10 : ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఓటు హక్కుల పరిరక్షణ కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం విడపనకల్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తిమ్మయ్య . మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా చేపడుతున్న చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ నిరసనలో ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన తెలియజేశారు. ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించే చర్య అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఆ హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు హక్కు లేకపోతే ప్రజలు తమ అభిప్రాయాన్ని ఎన్నికల ద్వారా పాలకులకు తెలియజేసే ముఖ్యమైన అవకాశాన్ని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, ఓటు హక్కుల పరిరక్షణ కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఓటు హక్కులను పరిరక్షించాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి! ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, గంగాధర్, రాజశేఖర్, రమేష్, నాగరాజు, నారాయణ, ఎర్రిస్వామి ,సూరి, గోవిందమ్మా, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ను తొలగించాలి...

ధర్మవరం లో సిపిఐ, సిపిఎం నిరసన




**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 10** ఎస్ఐఆర్ ప్రక్రియ వెంటనే ఆపివేయాలని, ఓటరు జాబితా ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలను నిరసిస్తూ ధర్మవరంలో వామపక్షాల ఆధ్వర్యంలో కళాజ్యోతి అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటరు జాబితా తయారీ, సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఓటర్ల పేర్ల తొలగింపు, చేర్పులు, సవరణల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు కలుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించి వాస్తవాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని కాపాడేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితా ప్రక్రియలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పార్టీలు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్ పట్టణ సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, శ్రీనివాసులు, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి ఆది చెన్నంపల్లి శ్రీనివాసులు మహిళా సమైక్య నాయకులు లలితమ్మ లింగమ్మ సిపిఎం నాయకులు రైతు సంఘం మారుతి చేనేత కార్మిక సంఘం కన్వీనర్ జె వి రమణ వెంకటస్వామి ఎల్ ఆదినారాయణ హరి తదితరులు పాల్గొన్నారు

## ఆంధ్ర సీనియర్స్ ఏ జట్టుకు మచ్చా దత్త రెడ్డి ఎంపిక

**-మొదటిపేజీ తరువాయి**

జట్టుతో హైదరాబాద్ నగరం నందు తలబడునుంది మచ్చా దత్త రెడ్డి ఆంధ్ర సీనియర్స్ ఏ జట్టుకు ఎంపిక కావడం పట్ల ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మంచో ఫెర్రర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనాథ్ కార్యదర్శి శ్రీధర్ సీనియర్ క్రికెటర్లు అసోసియేషన్ సభ్యులు అభినందన తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు

## స్థానిక ఎన్నికల్లో లీగల్ సెల్ రక్షణ కవచంలా నిలవాలి

**-మొదటిపేజీ తరువాయి**

పార్టీ లీగల్ సెల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని లీగల్ సెల్ సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా, ఎన్నికల ప్రక్రియను న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలని సజ్జల సూచించారు. 2024 ఎన్నికల అనంతరం పార్టీ కార్యకర్తలు తప్పుడు కేసులు, దాడులు, వేధింపులు ఎదుర్కొన్న సందర్భాల్లో లీగల్ సెల్ అండగా నిలిచిందని అభినందించారు. ఎన్నికల సమయంలోనూ కార్యకర్తలకు భరోసా కల్పించేలా ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తికాకముందే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం తొందరపడుతోందని సజ్జల విమర్శించారు. తుది ఓటర్ల జాబితా అందుబాటులోకి రాకముందే ఎన్నికలకు వెళ్తే కొత్తగా ఓటు హక్కు పొందినవారి హక్కులకు విఘాతం కలిగే అవకాశం ఉందని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, రిజర్వేషన్ల శాతం నిర్ణయానికి ప్రాతిపదిక ఏమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో నామినేషన్ దశ కీలకమని, కుల ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌ఓసీలు, ఇతర అవసరమైన ధ్రువపత్రాల విషయంలో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందుగానే సిద్ధం కావాలని సజ్జల సూచించారు. అభ్యర్థులతో పాటు ప్రత్యామ్నాయ అభ్యర్థులను కూడా సిద్ధంగా ఉంచాలని, ప్రతి గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు న్యాయవాదుల వివరాలను సేకరించి అందుబాటులో ఉంచాలని చెప్పారు. జిల్లా స్థాయిలో లీగల్ వార్‌రూమ్‌లు, నియోజకవర్గ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యలు తలెత్తిన వెంటనే రాష్ట్ర కార్యాలయానికి సమాచారం చేరేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని, అవసరమైతే రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని లేదా న్యాయస్థానాలను ఆశ్రయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సున్నిత ప్రాంతాలు, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లపై ముందుగానే దష్టి పెట్టాలని సూచించారు. ఎన్నికల సమయంలో అధికారులు, పోలీసులు లేదా ఇతరుల నుంచి చట్టవిరుద్ధ చర్యలు ఎదురైతే వాటిని ఆధారాలతో నమోదు చేయాలని సజ్జల చెప్పారు. ప్రతి ఫిర్యాదు, ఘటనకు సంబంధించిన వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచి, అవసరమైనప్పుడు న్యాయపరమైన చర్యలకు ఉపయోగించాలని సూచించారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని సమన్వయంతో సంబంధిత వేదికల ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. వైయస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు కేసులు, అరెస్టులు, వేధింపులు ఎదుర్కొన్న సమయంలో లీగల్ సెల్ అండగా నిలిచిందన్నారు. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన న్యాయవాదులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. మరో ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, నామినేషన్ పత్రాల తయారీ నుంచి దాఖలు వరకు అభ్యర్థులకు న్యాయవాదులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేయించాలని, నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి భద్రపరచాలని అన్నారు. ఏదైనా నామినేషన్ తిరస్కరణకు గురైతే వెంటనే న్యాయపరంగా స్పందించాలని పిలుపునిచ్చారు.

## సీఈసీ రాజీనామా డిమాండ్.. దద్దరిల్లిన దేశ రాజధాని ఢిల్లీ

**-మొదటిపేజీ తరువాయి**

ప్రాంతాల్లో పోలీసులు, పారా మిలటరీ బలగాలను మోహరించారు. జంతర్ మంతర్ వైపు వెళ్లే మార్గాల్లో తనిఖీలు చేపట్టి, పలు చోట్ల రాకపోకలపై ఆంక్షలు విధించారు. కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేయడంతో పాటు మధ్య ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. నిరసనల కారణంగా రైళ్ల రాకపోకలపైనా ప్రభావం పడింది. నిరసనలకు పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకుడు అభిజీత్ దీప్కే ఢిల్లీకి చేరుకోగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనుమతి లేకుండా ఆందోళన నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారన్న కారణంతో పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు కథనాలు పేర్కొన్నాయి. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకుంటున్నారని ఆందోళనకారులు విమర్శించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ సంఖ్యలో పేర్లు తొలగించడంపై వివాదం నెలకొంది. సుమారు 13 కోట్ల పేర్లు తొలగించినట్లు కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. అర్హులైన ఓటర్ల పేర్లు కూడా తొలగిపోయే ప్రమాదం ఉందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని, బాధ్యత వహిస్తూ సీఈసీ పదవి నుంచి తప్పుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఓటర్ల జాబితాల్లోని మార్పులు రాజకీయ ప్రయోజనాల కోసం చేపట్టినవన్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం, భాజపా ఖండించాయి.

## నేడు జరుగునున్న వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సదస్సును జయప్రదం చేయండి



అంకుశం న్యూస్,పుట్టపర్తి,అక్టోబర్:10:కదిరి,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రీ సత్యసాయి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.కదిరప్ప కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ కార్మికులు,కష్టజీవులు,పేద ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు,ఉపాధి సమస్యలపై ఈ సదస్సులో చర్చించను న్నారు. పేదలకు భూ పంపిణీ చేపట్టాలని,పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలని అదేవిధంగా పేదలకు నష్టం కలిగిస్తోందని సంఘం పేర్కొంటున్న అసైన్డ్ భూముల బదలాయింపునకు సంబంధించిన చట్ట సవరణను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నారు.వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణకు,వారి సమస్యల పరిష్కారానికి సంఘాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ జిల్లా సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.కోటేశ్వరరావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్,సీపీఐ శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్ హాజరుకానున్నారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు,కార్యకర్తలు,కష్టజీవులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.జిల్లాలోని వ్యవసాయ కార్మికులు,పేద రైతులు,కష్టజీవులు,ప్రజాసంఘాల నాయకులు ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## శ్రీవాణి ట్రస్ట్ ద్వారా చిన్నముష్టూరు గ్రామ ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి కోసం పది లక్షల రూపాయలు మంజూరు

ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి చేతులు మీదుగా చివరి విడత నిధులు అందజేత



**అంకుశం న్యూస్ ఉరవకొండ – అక్టోబర్ 10 :** ఉరవకొండ మండలం, చిన్నముష్టూరు గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఎమ్మెల్సీ వై శివరామ రెడ్డిని వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని ఎమ్మెల్సీ స్వగృహం నందు కలిసి ఆయన చేతులు మీదుగా ప్రభుత్వం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా దేవాలయ అభివృద్ధి కొరకై మంజూరు చేసిన పది లక్షల రూపాయలలో చివరి విడతగా మంజూరు కాబడిన మూడు లక్షల యాభై వేల రూపాయల చెక్కును అందుకున్నారు. దేవాలయ అభివృద్ధి కొరకు దేవాదాయ శాఖ మరియు తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 10 లక్షల రూపాయలు మంజూరు చేయించి ఆలయ అభివృద్ధి కొరకు విశేష కృషి చేసిన ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు తరలివచ్చి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి లో తాను పాలుపంచుకోవడం ఎంతో అదృష్టమని తన చేతులు మీదుగా మంజూరు కాబడిన మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలకు అందజేయడం సంతోషకరంగా ఉందని, ఆలయ అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని మిగిలిన ఆలయ ఆధునీకరణలో అందరూ పాలుపంచుకోవాలని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బోయ నారాయణస్వామి, రామాంజనేయులు, మాల రాజేష్, ముండ్ల రామంజీ, బి మల్లప్ప, ముష్టూరు ఎర్రిస్వామి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డి రామ్ సతీష్ రెడ్డికి డాక్టరేట్..





**.పోరుమామిళ్ల / చెన్నై, అక్టోబర్ 20(అంకుశం పత్రిక) :** చెన్నై నగరంలోని టీ.నగర్ కృష్ణ గాన సభ ఆడిటోరియంలో శనివారం డాక్టరేట్ అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ ప్రధానోత్సవంలో కడప జిల్లా బద్వేల్ కు చెందిన(పద్మావతి హాస్పిటల్) ప్రముఖ సంఘసేవికుడు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ అయిన పెద్దిరెడ్డి రామ సతీష్ రెడ్డీకి డాక్టరేట్ ను ప్రధానం చేశారు బద్వేల్ నియోజకవర్గంలో ...చెట్లను నాటి, సంరక్షించినందుకు, ఆధ్యాత్మిక అభివృద్ధికి, వన్య ప్రాణుల సంరక్షణకు విశేష కృషి చేసినందుకు, సామాజిక సేవా కార్యక్రమాలు ఉధృతంగా నిర్వహించి, బడుగు,బలహీన వర్గాలకు, అనాథలకు నేనున్నానంటూ, ఆపన్న హస్తం అందించినందుకు, నియోజకవర్గంలో పలుచోట్ల చెట్లను నాటించి, వాటి సంరక్షణకు నడుం బిగించి ప్లానిటేషన్ అభివృద్ధికి కృషి చేసినందుకు, అడవిలో మూగ జీవాల సంరక్షణ కోసం పాటుపడినందుకు, పేద ప్రజల కోసం అనేక స్మశానవాటికల నిర్మాణాలు చేపట్టినందుకు సమాజాసేవా కార్యక్రమాల్లో 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తూ నిస్వార్థంగా సేవలు అందిస్తుండడంతో...ఆయన సేవలను గుర్తించిన అమెరికన్ యూనివర్సిటీ శనివారం చెన్నై నగరంలోని కృష్ణ గానసభ ఆడిటోరియంలో రామ్ సతీష్ రెడ్డికి డాక్టరెట్ ను ప్రధానం చేశారు. అవార్డుతో పాటు ధ్రువ పత్రాన్నికూడా యూనివర్సిటీ ప్రతినిధులు అందచేశారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు రిటైర్డ్ ఐఏఎస్, ఐపీస్ లు, బిజినెస్ మేన్లు, డాక్టర్లు సయితం ఈ డాక్టరేట్ అందుకోవడం ప్రత్యేక ఆకర్షణ. అమెరికన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా డాక్టర్ పెద్దిరెడ్డి రామ్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ...ఈ అత్యున్నత అవార్డును అందుకున్నందుకు సంతోషంగా ఉందని, దీంతో సమాజంపట్ల నా భాద్యత రెట్టింపు అయిందని అన్నారు. “మంచి పనులు సేవా ఫౌండేషన్” ద్వారా భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరింప చేస్తానని, పేద ప్రజలకు, అనాథలకు అండగా వుంటూ... సమాజసేవలో వేగం పుంజుకొని ముందుకు నడుస్తానన్నారు. సోషల్ వర్క్, సాఫ్ట్ వేర్, బిజినెస్, వైద్య రంగం, స్పోర్ట్స్, మ్యూజిక్, మార్షల్ ఆర్ట్స్ తదితర రంగాలనుంచి పలువురు డాక్టరేట్ అందుకున్నారు. హాంగ్ కాంగ్, మలేసియా, సింగపూర్, జపాన్ తదితర దేశాల నుంచి కూడా పలువురు ఈ డాక్టరేట్ ను అందుకోవడం గమనార్హం.

# ఎన్.హెచ్-42 రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలి..

**కేంద్ర రోడ్డు,రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్..**

**ఢిల్లీలో కేంద్రమంత్రికి లేఖ అందించిన మంత్రి పయ్యావుల కేశవ్.. సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కేంద్ర మంత్రి..**



**అంకుశం న్యూస్ ఉరవకొండ అక్టోబర్ 10 :** అనంతపురం జిల్లాలోని ఉరవకొండ నియోజకవర్గం మీదుగా వెళుతున్న ఎన్.హెచ్ - 42 రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. ఈ విషయమై శనివారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కలిసి ఎన్.హెచ్-42 రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని ప్రత్యేకంగా లేఖను అందించగా, రహదారి విస్తరణకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు.అనంతపురం - బళ్ళారి రోడ్డులో ఆయా గ్రామ సరిహద్దులయందు తీవ్ర మలుపులు ఉండడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తుండడంతో మంత్రిగారు ప్రత్యేక చొరవ తీసుకుని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్.హెచ్-42 (ఆంధ్రప్రదేశ్ / కర్ణాటక సరిహద్దు నుండి అనంతపురము సెక్షన్, కి.మీ 4/350 నుండి 75/600 వరకు) రహదారిని నాలుగు లేన్ల రహదారిగా ఉన్నతీకరించాలని మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. ప్రస్తుతం, ఈ 71.25 కి.మీ పొడవున్న రహదారి అనేక మెరుగుపరచని అడ్డ మరియు నిలువు వంపులతో రెండు లేన్ల రహదారిగా ఉందన్నారు. ఇది ఎక్కువ జనాభా గల అనేక పరిపాలనా కేంద్రాలు మరియు నివాస ప్రాంతాల గుండా వెళుతుందన్నారు. అనంతపురం జిల్లా కేంద్రం, ఉరవకొండ నియోజకవర్గ కేంద్రం,ఉరవకొండ,కూడేరు,విడపనకల్లు మండలాలు మరియు 15 గ్రామాల మీదుగా ఎన్.హెచ్-42 రహదారి వెళుతుందని తెలిపారు.2010లో ఈ మార్గాన్ని రాష్ట్ర రహదారి నుండి జాతీయ రహదారిగా (ఎన్.హెచ్-42) మార్చారన్నారు. ఇది ఎన్.హెచ్-67 పై జోలదరసి (కర్ణాటక) వద్ద ప్రారంభమై, ఉరవకొండ, అనంతపురము,రాప్తాడు, కదిరి,పలమనేరు మరియు కుప్పం గుండా ప్రయాణించి, ఎన్.హెచ్-48 పై కృష్ణగిరి (తమిళనాడు) వద్ద ముగుస్తుందన్నారు. 2015-16లో ఈ మార్గాన్ని పేవ్డ్ షోల్డర్లతో రెండు లేన్లకు విస్తరించారని, అయితే, భౌగోళిక ఆకృతిలో పెద్దగా మెరుగుదలలు లేదా బైపాస్‌ల నిర్మాణం వంటివి చేపట్టలేదన్నారు.ఈ రహదారి అనేక నివాస ప్రాంతాల గుండా నేరుగా వెళుతూ, పదునైన మలుపులను కలిగి ఉండటం వల్ల, ఇది తీవ్రమైన భద్రతా ప్రమాదంగా మారి, ట్రాఫిక్ ప్రమాదాల సంఖ్య పెరగడానికి దారితీసిందన్నారు. ముఖ్యంగా, ఈ నిర్దిష్ట మార్గంలో మొత్తం 10 ప్రమాదకర ప్రాంతాలను అధికారికంగా గుర్తించారని, ఈ రహదారిని తక్షణమే నాలుగు లైన్ల రహదారిగా మార్చాలని మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర మంత్రిని కోరారు. ఎన్.హెచ్-42 రహదారిని నాలుగు లైన్ల రహదారిగా మార్చేందుకు కేంద్రమంత్రి వెంటనే సూత్రపాయంగా అంగీకారం తెలపడం జరిగింది. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి

## అక్టోబర్ 11న జరిగేఉత్తరాంధ్ర ఉద్యోగుల "న్యాయ భేరి" ని జయప్రదం చేయండి

**బహుజన ఉద్యోగ,ఉపాధ్యాయ, మేధావులకు, పాల్గొనండి**

**డాక్టర్ పోతుల నాగరాజు**




**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 10** దేశంలో 83% ఉన్న బహుజన సమాజం అన్ని రంగాలలో అణచి వేయబడుతుంది, అవమానాలకు గురి అవుతుంది, దోపిడికి బలి అవుతుంది, మోసాలకు గురి అవుతుంది, ఇలా జరగడానికి కారణం ఎవరు? మన ఓటు ద్వారా అధికారం లో ఉన్న వారా! లేక వారికీ ఓటు వేసిన పాపానికి శిక్ష అనుభవిస్తున్న బహుజన సమాజమా! ఇలా అనేక అనుమానాలకు జరుగుతున్న నష్టంకు, ఎవరు కారణం అనే సమాధానం కోసం రిజర్వేషన్ల పరిరక్షణ సమితి మరియు రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లో ప్రాంతాల వారీగా బహుజన సమాజంలోని విద్యావంతులను, ఉద్యోగులను, రాజకీయల తో సంబంధం ఉన్న వారిని, వ్యాపారం చేసే వారిని, న్యాయ వాదులను, మహిళ లను, ఇతర వృత్తి నిపుణులను, విద్యార్థులను, పారిశ్రామిక వేత్తలను, రచయిత లను, సోషల్ మీడియా, కళాకారులను, పదవి విరమణ చేసిన పెద్దల అందరిని కలిపి ప్రతి ప్రాంతం లోను గ్రేటర్ రాయల సీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ఆంధ్ర, తెలంగాణ లలో ప్రాంతీయ సభ లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆ సభల కు "బహుజన ఉద్యోగుల న్యాయ భేరి " పేరు తో నిర్వహించడం జరుగుతుంది. గత జులై నెలలో గ్రేటర్ రాయల సీమ న్యాయ భేరి కార్యక్రమం నంద్యాల జిల్లా కేంద్రం చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇప్పుడు అంటే అక్టోబర్ 11 న ఆదివారం 10 గంటలకు ఉత్తరాంధ్ర జిల్లాల "బహుజన ఉద్యోగుల న్యాయ భేరి" కార్యక్రమం అనకాపల్లి జిల్లా కేంద్రం లో. కళ్యాణ వెంకటేశ్వర్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ న్యాయ భేరి కి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ,ఒరిస్సా, తమిళనాడు రాష్టాల నుంచి ప్రతినిధులు కూడా రావడం జరుగుతుంది. ఈ న్యాయ భేరి ని జయప్రదం చేయాలని బహుజన సమాజంకు పిలుపు నిస్తూ, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక ను ప్రాంతాల వారీగా జరుగుతున్న సామజిక ,ఆర్థిక, రాజకీయ నష్టంను నివారణ కోసం బలమైన ఉద్యమం నిర్మాణం కోసం ఈ న్యాయ భేరి కార్యక్రమం ఉపయోగ పడుతుంది అని డాక్టర్ పోతుల నాగరాజు తెలియ చేశారు.

## ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ అక్టోబర్ 17న ప్రారంభం

**ఐపీఎల్ తరహాలో కలర్ డ్రెస్సులతో క్రికెట్ టోర్నీ**

**శ్రీ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ఎంప్లాయిస్ క్రికెట్ లీగ్ ప్రారంభం**

**టోర్నమెంట్లో మొత్తం 30 ఉద్యోగస్తుల క్రికెట్ జట్లు**

**మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షులు ఏపీ వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్**






**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి అక్టోబర్ 10** అనంతపురం జిల్లా లో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ స్థాపించి జిల్లా ప్రజలకు విద్య వైద్య క్రీడారంగంలో విశేష సేవలు అందించిన శ్రీ విన్సెంట్ ఫెర్రర్ జ్ఞాపకార్థం అనంతపురం నగరంలోని ఆర్డిటి క్రీడా మైదానం నందుఏపీ వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ అనంతపురం నగరంలోని ఆర్డిటి మైదానం నందు అక్టోబర్ 17వస ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం జరుగుతుందని మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షులు వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ తెలిపారు. ఈ ఏడాది నిర్వహించడం ద్వారా జిల్లాలో 25వ సంవత్సరం సిల్వర్ జూబ్లీ టోర్నమెంట్ గా ఉద్యోగస్తులు పోటీలు నిర్వహించడం జరుగుతున్నదని విన్సెంట్ ఫెర్రర్ పేరుమీద 25 సంవత్సరాలుగా ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతున్నదని మచ్చ రామలింగారెడ్డి అన్నారు అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మచ్చా రామలింగారెడ్డి తోఆర్గనైజింగ్ సెక్రటరీ కే విజయరాజు సభ్యుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు ఐపీఎల్ తరహాలో ఉద్యోగస్తులకు ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ అనంతపురం పేరుతో ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని, మచ్చ రామలింగారెడ్డి తెలిపారు.ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్లో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మొత్తం 30 డిపార్ట్మెంట్లు ఉద్యోగస్తులు క్రికెట్ పట్ల ఆసక్తితో ఈ టోర్నమెంట్ లో పాల్గొంటున్నారని కేవలం సెలవు దినాల్లో మాత్రమే ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులందరూ ఈ టోర్నమెంట్ లో పాల్గొనడం అభినందనీయమని మచ్చ రామలింగారెడ్డి అన్నారు మొదటి మ్యాచ్ ఈనెల 17వ తారీఖున ప్రారంభిస్తామని 18వ తారీఖున కూడా పోటీలు ఆర్డిటి స్టేడియం నందు జరుగుతాయని మచ్చ రామలింగారెడ్డి వివరించారుఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాలలో గల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగస్తులు ఈ టోర్నమెంట్లో పాల్గొనవచ్చు. పాల్గొనే ఉద్యోగస్తులకు కలర్ టీ షర్ట్ లు అందజేయడం జరుగుతుందని,మచ్చ రామలింగారెడ్డి తెలిపారు

**కె. విజయ రాజు**

**ఆర్గనైజింగ్ సెక్రటరీ వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ . సెల్ ఫోన్ నెంబర్9490062555**

## టీటీడీ వైద్యశాలలకు రూ.18 లక్షల విలువైన ఔషధాల విరాళం



**అంకుశం న్యూస్ తిరుపతి అక్టోబర్ 10** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదరాబాద్ కు చెందిన ఎస్ఎస్కె ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ ప్రొప్రైటర్ శ్రీ జి. శ్రవణ్ కుమార్ రూ.15 లక్షల విలువైన ఔషధాలను, ఇందు డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత తలశిల వెంకటేశ్వరరావు రూ.3 లక్షల విలువైన ఔషధాలను శనివారం విరాళంగా అందించారు. ఈ మేరకు టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ నన్నపనేని సదాశివరావు శనివారం తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బి.ఆర్. నాయుడును కలిసి దాతల తరఫున ఔషధాలను అందజేశారు.

## ధర్మవరంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేతను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సోదరుడు వెంకట కృష్ణా రెడ్డి



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 10** ధర్మవరం వై ఎస్ ఆర్ సీపీ మీడియా సైనికుడు చెన్నారెడ్డి నీ వెంకట కృష్ణారెడ్డి పరామర్శ. దేవి నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్న చెన్నారెడ్డిని పరామర్శించిన యువనాయకుడు ధర్మవరం మాజీ ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి ప్రమాదవశాత్తు గాయపడి సర్జరీ చేయించుకున్న చెన్నారెడ్డిని పరామర్శించిన కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి. చెన్నారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న యువనాయకుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

## ఎవరు అడ్డొచ్చినా బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం

**అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్...**




**అంకుశం న్యూస్, అనంతపురం,అక్టోబర్ : 10** ఎవరు అడ్డుకున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, బీసీలకు తెలుగుదేశం ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేసిన ద్రోహాన్ని వివరించారు. బీసీలకు మొదటి నుంచి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ తెలుగుదేశం మాత్రమేనన్నారు. గతంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యతను 20 శాతం నుంచి 34 శాతానికి పెంచిన ఘనత టీడీపీదేనన్నారు. ఆరోజు ఎన్టీఆర్ ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అనేక మంది బీసీ నేతలకు ఉన్నత పదవులు దక్కాయన్నారు. బీసీలకు మొదటి నుంచి ద్రోహం చేసింది వైసీపీనేనని. కేవలం అధికారం తన వర్గానికే ఉండాలనేది జగన్ ఆలోచనన్నారు. గతంలో శంకర్ నారాయణ లాంటి వారు మంత్రిగా ఉన్నప్పటికీ, వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా జగన్ రెడ్డి అణచివేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు రాకుండా హైకోర్టులో, ఆపై సుప్రీం కోర్టులో జగన్ మోకాలడ్డారని ఆరోపించారు. బీసీలు రాజకీయంగా ఎదగకూడదన్నదే జగన్ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులకు కనీసం ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కూడా దక్కలేదన్నారు. జగన్ కేవలం ముగ్గురిని మాత్రమే దగ్గర పెట్టుకుని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పూర్తిగా దూరం పెట్టారన్నారు. రైజింగ్ రాయలసీమగా మన ప్రాంతం దూసుకుపోతోంది రాయలసీమ ప్రాంతాన్ని రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా మార్చబోతున్నామని దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 40వేల కోట్లు, కేంద్ర ప్రభుత్వం పీపీపీ మోడల్‌లో మరో రూ. 60వేల కోట్లు తీసుకురావడం జరుగుతోందన్నారు. మదనపల్లిలో రిలయన్స్ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మక హార్టీకల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాన్నారు.

## ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి యూజేఏసీ కన్వీనర్ సి. జాఫర్ ....




**అంకుశం న్యూస్, అనంతపురం, సెప్టెంబర్:10** ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, ఈవీఎంలను నిషేధించి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం నగరంలో యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ (యూజేఏసీ), వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.నగరంలోని టవర్ క్లాక్ వద్ద జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభించారు. టవర్ క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ఎన్నికల కమిషన్ తీరును నిరసించారు.ఈ సందర్భంగా యూజేఏసీ కన్వీనర్ సి. జాఫర్ మాట్లాడుతూ.దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి సుమారు 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించబడ్డాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి ఎన్నికల కమిషన్ బాధ్యత వహించాలని, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల కమిషన్ పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇబ్బందులు కలిగించే చట్టాలు తీసుకొస్తోందని, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే విధానాలను అనుసరిస్తోందని నాయకులు విమర్శించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా అనంతపురంలో ఈ ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేయడానికి వచ్చిన వారిని అరెస్టు చేయడం, రాజకీయ నాయకులను నిర్బంధించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు కొనసాగితే భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఎం తదితర వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, యూజేఏసీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని, ఓటర్ల హక్కులను కాపాడాలని నినాదాలు చేశారు.

## పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

**కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**అంకుశం న్యూస్,కదిరి,అక్టోబర్:10:** విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ వద్ద సిఇసి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భాగంగా,పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఆంజనేయులు ని పోలీసులు అత్యంత దారుణంగా,నిరంకుశంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలియజేశారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు.ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే గొంతులను పోలీసు బలంతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.ప్రజల హక్కుల కోసం,ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతూనే ఉంటుంది.అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ నాయకులను,కార్యకర్తలను భయపెట్టలేరు.ప్రజా సమస్యలపై మా పోరాటం ఆగదు!ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం -- నిరంకుశ విధానాలను ప్రతిఘటిద్దాం అని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తెలియజేశారు.

# వైఎస్ఆర్, జక్కంపూడి, కాటన్ దొరలతో పాటు పలువురు నాయకులకు పిండ ప్రదానం చేసిన వైయస్ఆర్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 10:** మహాలయ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాజమహేంద్రవరంలోని కోటిలింగాల రేవు నందు తమ కుటుంబ సభ్యులతో పాటు పలువురు దివంగత నాయకులకు వైయస్ఆర్ సిపి జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి శాస్త్ర యుక్తంగా పండితులు సాయి కుమార్ శర్మ ఆధ్వర్యంలో శ్రద్ధాకర్మలు నిర్వహించిపిండప్రదానం చేసారు, మరణించినతమ కుమారుడు స్వర్గీయ సబ్బెళ్ళ సురేష్ రెడ్డి, తన తల్లి సబ్బెళ్ళ బాపయ్యమ్మ,లతో పాటు దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ రోడ్డు భవనాల శాఖ మాత్యులు స్వర్గీయ జక్కంపూడి రామ్మోహన్ రావు, పార్టీ సీనియర్ నాయకులు మాజీ సి డి సి , పొలమూరు నీటి వినియోగదారుల సంఘంచైర్మన్ స్వర్గీయ సత్తి వీర్రెడ్డి, గోదావరి డెల్టా ఆరాధ్య దైవం అన్నదాత స్వర్గీయ సర్ ఆర్థర్ కాటన్, అన్నవరం దేవస్థానం మాజీ చైర్మన్ మోకా సూరిబాబు తదితరులకు పిండ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ మహాలయ అమావాస్యనాడు మరణించిన తల్లిదండ్రులు, తాతముత్తాతలు, స్నేహితులు, గురువులుఇతర పూర్వీకులను స్మరించుకుంటూ నీటితో తర్పణం సమర్పిస్తారని. హైందవసంప్రదాయం ప్రకారం నువ్వులు, నీరు ఉపయోగించి పితృదేవతలకు తర్పణం ఇవ్వడం , కింద ప్రధానం చేయడం , శ్రద్ధ కర్మలు చేయడం వలన వారి పట్ల కృతజ్ఞతను తెలియజేసినట్లుగా భావిస్తారని ఈ ఆచారం ప్రకారమే ముఖ్యమంత్రిగా దివంగత రాజశేఖర్ రెడ్డి ఈ రాష్ట్ర ప్రజలకు ఆరాధ్య దైవంగా నిలిచారని ఆరోగ్యశ్రీ పథకంతో మరియు తన ఇతర సంక్షేమ పథకాలతోప్రతి కుటుంబంలో రాజశేఖర్ రెడ్డి ఒక సభ్యుడు అయ్యారని, ఆర్ అండ్ బి మంత్రిగా జక్కంపూడి రామ్మోహన్ రావు రాష్ట్రం తో పాటుఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కు అభివృద్ధి బాటలు వేసిన వ్యక్తిని కరువు కాటకాలతో తల్లడిల్లుతున్న డెల్టా ప్రాంతానికి బ్రిటిష్ అధికారిగా వచ్చిన ధవలేశ్వరం ఆనకట్ట నిర్మాణ ప్రదాత సర్ ఆర్థర్ కాటన్ అన్నదాత అయ్యారని, తనకు రాజకీయంగా మార్గదర్శకంగా నిలిచిన గురు సమానులు స్వర్గీయ సత్తి వీర్రెడ్డి, రాజకీయాలలో తన ఆప్తమిత్రుడు మోకా సూరిబాబు లను తనకుకుటుంబ సభ్యులు కంటే ఎక్కువ అని అందుకే మరణించిన తన కుటుంబ సభ్యులతో పాటు ఈ మహా పర్వదినం నాడు వీరి పేరున కూడా శ్రద్ధ కర్మలు నిర్వహించిపిండ ప్రధానం చేయడం జరిగిందని సబ్బెళ్ళ కృష్ణారెడ్డి అన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల పాలిట వరం -ఎమ్మెల్యే నల్లమిల్లి





**48 మంది పేషెంట్లకు మంజూరైన రూ 40 లక్షల చెక్కులను అందించిన నల్లమిల్లి**

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 10:** అనపర్తి మండలం రామవరంలో అనపర్తి నియోజకవర్గానికి సంబంధించి 48 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వైద్య సహాయం నిమిత్తం మంజూరైన 40 లక్షల రూపాయల విలువ కలిగిన చెక్స్ ను అందచేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమావేశంలో మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 48 మంది లబ్దిదారులకు గాను, 40 లక్షల రూపాయల చెక్కులను ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా ఈ ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది పేదలకు వరంగా మారిన పరిస్థితిని చూస్తా ఉన్నాం. పెద్ద ఎత్తున మననియోజకవర్గంలో ఈ మధ్యకాలంలో దాదాపుగా ఒక నెలలోనే ఐదు ఆరు రోజుల్లో 40 మందికి ఒకసారి,50 మందికి ఒకసారి, మొన్నటి రోజున అయితే 84 మందికి కూడా ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున కోట్లాది రూపాయల నిధులు ఇవాళ ఈ విధంగా ముఖ్యమంత్రి గారు రోగుల్ని ఆదుకోవాలి పేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో దీన్ని ఇవ్వడం జరుగుతాఉంది. దురదృష్టకరమైన విషయం ఏంటంటే గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది పూర్తిగా మర్చిపోయారు. 2014-19 మధ్యకాలంలో చంద్రబాబు నాయుడుగారు విరివిగా ముఖ్యమంత్రి సహానిధి ఇచ్చారు. మరలా తర్వాత ఐదు సంవత్సరాల్లో పూర్తిగా నిర్వీర్యం అయిపోయింది మరలా ఈరోజు ఇవ్వడం జరుగుతా ఉంది. ఇవాళ ఇప్పటివరకు రాష్ట్రంలో 1500 కోట్ల రూపాయల్ని ఈ రెండు సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఇవ్వడం జరిగింది. మరి వీళ్ళు సంక్షేమం లేదు, సంక్షేమం లేదు అని మాట్లాడడం జరింది. జరుగుతా ఉంది. సంక్షేమం లేనప్పుడు ఇది సంక్షేమం కాదా అని అడుగుతా ఉన్నా పెద్ద ఎత్తున ఎవరైతే వివిధ ఆసుపత్రుల్లో వైద్య సహాయం చేయించుకున్నారో ఆ వైద్యం నిమిత్తం ఈ సహాయం అందివ్వడం జరుగుతా ఉంది. మరి ప్రభుత్వం ప్రకటించినవి కాకుండా ఇది ప్రకటించకుండా బడ్జెట్లో కూడా దీనికి ప్రత్యేకమైన కేటాయింపు లేనప్పటికీ కూడా ముఖ్యమంత్రి గారు సిఎస్ఆర్ నిధులు గానీ ఇతర నిధులు గానీ పెద్ద ఎత్తున తీసుకొని ఈ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద కార్యక్రమం ఇవ్వడం జరుగుతా ఉంది. మీరందరూ అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి గారు ఇంత విరివిగా మీ అందరికీ ఈ కార్యక్రమం చేస్తున్నప్పుడు ముఖ్యమంత్రి గారి నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం కూడా ఉంది. ముఖ్యమంత్రి గారి నాయకత్వం బలపరచడం అంటే కూటమి నాయకత్వాన్ని బలపరచాలి. అందువల్ల రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పెద్ద ఎత్తున మీరు మీ బంధువులు లేకపోతే మీకు కావలసిన వారందరి చేత కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభివృద్ధిని గెలిపించే దిశగా మీరందరూ కృషి చేయాలని మీ అందరికీ సవినయంగా తెలియజేసుకుంటున్నాను.

# మాదకద్రవ్యాలు శరీర ఆరోగ్యానికే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు కూడా ప్రమాదము

**డా.సి.వి. మదన్ కుమార్.. కదిరి మున్సిపల్ హైస్కూల్లో 'ఆరోగ్యమే ముద్దు' కార్యక్రమం**

**విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన**

**అంకుశం న్యూస్,కదిరి,అక్టోబర్:10:** కదిరి--హిందూపూర్ రోడ్డులోని మున్సిపల్ హైస్కూల్లో పాఠశాల హెచ్ఎం శైలజ ఆధ్వర్యంలో విద్యార్థినీ,విద్యార్థులకు 'ఆరోగ్యమే ముద్దు'అనే అంశంపై మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిన్నపిల్లల వైద్యులు,సామాజిక సేవకులు డాక్టర్ మదన్ కుమార్,ప్రముఖ న్యాయవాది ఉచిత న్యాయ సలహాదారులు నరసింహులు,స్కూల్ చైర్ పర్సన్ రొడ్డార్పు హరిప్రసాద్,కదిరి అర్బన్ ఏఎస్ఐ వెంకటరమణ,రేట్స్ సంస్థ ప్రతినిధి మెహతాజ్ వైస్ చైర్మన్ జీవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ,మత్తు పదార్థాల వినియోగం క్షణకాల ఆనందాన్ని కలిగించినా,జీవితాంతం విషాదానికి దారితీయవచ్చని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు శరీర ఆరోగ్యానికే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు కూడా ప్రమాదకరమని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల గుండె,కాలేయం,ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని,అలాగే మానసిక ఒత్తిడి, ఆందోళన,జ్ఞాపకశక్తి తగ్గడం,డిప్రెషన్ వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. అంతేకాకుండా కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, ఆత్మీయులకు దూరం కావడం,మాదకద్రవ్యాల కోసం దొంగతనాలు వంటి నేరాలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడవచ్చని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి,చదువుపై,నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. చదువు, క్రీడలు,సంగీతం వంటి సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తెలిపారు. చదువులో లేదా వ్యక్తిగత జీవితంలో ఒత్తిడికి గురైతే స్నేహితులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు లేదా పెద్దలతో తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు. "మత్తు మనిషిని బానిసగా మారుస్తుంది.. చదువు మనిషిని విజేతగా మారుస్తుంది" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారిని నిందించకుండా,వారికి వైద్యులు లేదా కౌన్సిలర్ల ద్వారా తగిన సహాయం అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు,స్నేహితులకు కూడా మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. "డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దాం.. భావితరాలను కాపాడుకుందాం"అనే నినాదంతో విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. నేటి బాలలే రేపటి భారతదేశ భవిష్యత్తు పౌరులని, వారి ఆరోగ్యం,భవిష్యత్తును కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది,స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ వైస్ చైర్మన్ జీవిత, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కాశీలో కాలభైరవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తోట



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 10:** ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా వారణాసి క్షేత్రంలో కొలువైన కాశీ క్షేత్రపాలకుడు శ్రీ కాలభైరవ స్వామిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనం పలికారు.

## అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిఎస్పి



**అంకుశం న్యూస్,అనంతపురం, అక్టోబర్:10:** అనంతపురం నూతన డీఎస్పీ కరుణాకర్ రావు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేలా శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా విధులు నిర్వహించాలని, ప్రజల భద్రతకు పెద్దపీట వేయాలని నూతన డీఎస్పీకి కరుణాకర్ రావుకి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## ఆదివారం నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేగుళ్ళ పర్యటన

**రూ.4.57 కోట్లతో నిర్మాణాలు..**

**తొమ్మిది గ్రామాల్లో డ్వాక్రా భవనాలకు శంకుస్థాపనలు**



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 10:** మండపేట నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన డ్వాక్రా భవనాల నిర్మాణాలకు ఆదివారం శంకుస్థాపనలు నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. . రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అక్టోబర్ 11వ తేదీన తొమ్మిది గ్రామాల్లో పర్యటించి నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 9.30 గంటలకు వెదురుపాకలో రూ.33 లక్షలతో, 10.30 గంటలకు వెంటూరులో రూ.35.89 లక్షలతో, 11 గంటలకు మాచవరంలో రూ.41 లక్షలతో, 11.30 గంటలకు నేలటూరులో రూ.75 లక్షలతో నిర్మించనున్న డ్వాక్రా భవనాలకు శంకుస్థాపనలు చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వెలగతోడులో రూ.31 లక్షలతో, 3.30 గంటలకు కేశవరంలో రూ.69 లక్షలతో, సాయంత్రం 4 గంటలకు ద్వారపూడిలో రూ.కోటితో, 4.30 గంటలకు తాపేశ్వరంలో రూ.27 లక్షలతో, 5 గంటలకు అర్తమూరులో రూ.46 లక్షలతో చేపట్టనున్న భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహిస్తారు. ఈ తొమ్మిది భవనాల నిర్మాణాలకు మొత్తం రూ.4.57 కోట్ల నిధులు కేటాయించారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయ వర్గాలు కోరాయి.

## ఉన్నత్ భారత్ అభియాన్‌లో భాగంగా రెడ్డిపల్లి గ్రామంలో కుటుంబాల ప్రాథమిక సర్వే నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం



**బుక్కరాయసముద్రం అంకుశం న్యూస్ , అక్టోబర్ 10, :** ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రెడ్డిపల్లి గ్రామంలో కుటుంబాల ప్రాథమిక సర్వేను నిర్వహించింది. విశ్వవిద్యాలయ ఉన్నత్ భారత్ అభియాన్ కమిటీ, ఆర్థికశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వేలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామీణ కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడం, వారి అభివృద్ధి అవసరాలను గుర్తించడం ఈ సర్వే ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా విద్య, వృత్తి, ఆదాయం, వ్యవసాయం, గృహవసతి, పారిశుద్ధ్యం, వైద్య ఆరోగ్య సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లభ్యత తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. అధ్యాపకుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు గ్రామంలోని కుటుంబాలను సందర్శించి, గ్రామస్థులతో నేరుగా మాట్లాడి అవసరమైన సమాచారాన్ని సేకరించారు. ఈ క్షేత్రస్థాయి సర్వే విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడంతో పాటు, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అర్థం చేసుకోవడానికి దోహదపడింది. సర్వే నిర్వహణకు గ్రామస్థులు సహకరించారు. సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, రెడ్డిపల్లి గ్రామానికి సంబంధించిన ప్రాథమిక సామాజిక, ఆర్థిక వివరాలను రూపొందించనున్నారు. తద్వారా గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన రంగాలను గుర్తించేందుకు అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి (ఇన్‌చార్జి) ప్రొఫెసర్ షీలా రెడ్డి ఉన్నత్ భారత్ అభియాన్ కమిటీ, అధ్యాపకులు, విద్యార్థుల కృషిని అభినందించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. బి. కివాడే కూడా సర్వేను విజయవంతంగా నిర్వహించిన బృందాన్ని ప్రశంసించారు. ఆర్థికశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బబ్బూర్ వెంకటేశ్వర్లు సర్వే బృందాన్ని అభినందిస్తూ, గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా అర్థం చేసుకోవడంలో క్షేత్రస్థాయి సర్వేలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా విశ్వవిద్యాలయానికి, గ్రామీణ సమాజానికి మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు, ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా స్థిరమైన గ్రామీణ అభివృద్ధిని ప్రోత్సహించేందుకు మరో ముందడుగు పడింది